వర్త్ వర్మ వర్త్!

వర్త్ వర్మ వర్త్..ఈ ఫేమస్ డైలాగ్ గుర్తుండే ఉంటుంది. సూపర్‌స్టార్ రజినీకాంత్ జైలర్ సినిమా ద్వారా పాపులర్ అయిన ఈ డైలాగ్ మన హైదరాబాదీ తిలక్‌వర్మకు అతికినట్లు సరిపోతుంది. దక్షిణాఫ్రికాతో శుక్రవారం నాలుగో టీ20లో తిలక్ సునామీ సెంచరీ చూసిన ప్రతి ఒక్కరికి మనసులో అనిపించే ఉంటుంది. వాండరర్స్‌లో ప్రకంపనలు సృష్టిస్తూ సఫారీలను వర్మ ఓ ఆటాడుకున్నాడు. బౌండరీలు చిన్నబోయేలా ఫోర్లు, సిక్స్‌లు బాదుతూ బౌలర్లను చేష్టలుడిగేలా చేశాడు. పట్టుమని 20 మ్యాచ్‌లాడిన ఈ నూనుగు మీసాల కుర్రాడు..దక్షిణాఫ్రికాపై ప్రకంపనలు సృష్టించాడు. బ్యాక్ టు బ్యాక్ సెంచరీలతో తన విలువేంటో ఘనంగా చాటిచెప్పాడు. గాయాలకు తోడు ఫామ్‌లేమితో జట్టులోకి వస్తూ పోయిన తిలక్..భారత భవిష్యత్ ఆశాకిరణంలా కనిపిస్తున్నాడు. – (నమస్తే తెలంగాణ క్రీడా విభాగం)

నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ..అలియాస్ వర్మ. భారత క్రికెట్‌లో మారుమోగుతున్న పేరు. క్రికెట్ దిగ్గజాలు రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ రిటైర్మెంట్ తర్వాత వారి స్థానాలు ఎవరు భర్తీ చేస్తారో అన్న ప్రశ్నలకు ఫుల్‌స్టాప్ పెడుతూ తాను ఉన్నానంటూ జెండా పాతాడు తిలక్. దక్షిణాఫ్రికా పర్యటన రూపంలో టీమ్‌ఇండియాకు తిలక్ రూపంలో అసలు సిసలైన టీ20 ఆణిముత్యం దొరికింది. సంప్రదాయక క్రికెట్ షాట్లకు కామ పెడుతూ ట్రేడ్‌మార్క్ షాట్లతో ఈ హైదరాబాదీ..సఫారీలపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డ తీరు ఫ్యాన్స్‌ను కట్టిపడేసింది. ఇన్ని రోజులు క్లాసిక్ షాట్లకు కట్టుబడ్డ వర్మ..తనలో కొత్త కోణాన్ని పరిచయం చేశాడు. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో రిజర్వ్ బెంచ్‌కే పరిమితమైన 22 ఏండ్ల తిలక్..దక్షిణాఫ్రికాతో సిరీస్ ద్వారా అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. పేసర్‌కు స్వర్గధామమైన సఫారీ పిచ్‌లపై తన విధ్వంసక బ్యాటింగ్‌తో కెరీర్‌కు మెండైన పునాది వేసుకున్నాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో అంతగా ఆకట్టుకోలేకపోయిన వర్మ..ఆఖరి రెండు మ్యాచ్‌ల్లో విశ్వరూపమే చూపాడు. మూడో టీ20లో ప్రమోషన్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ఈ కుర్రాడు చాలా పరిణతి కనబరిచాడు. ఓవైపు ఇన్నింగ్స్‌లో దూకుడు తగ్గకుండా పరుగుల జోరు కొనసాగిస్తూ భారీ స్కోరు అందించాడు. శుక్రవారం నాటి మ్యాచ్‌లోనూ అదే రిపీట్ చేస్తూ తిలక్ ఆడిన ఆట విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మద్దతుతో కీలకమైన మూడో నంబర్‌లో వచ్చిన తిలక్ తన ప్రమోషన్‌కు సార్థకత చేకూర్చాడు.

జూనియర్ '360':

ఇన్నాళ్లు క్లాసిక్ షాట్లు ఆడుతూ పరుగులు సాధించిన తిలక్..తన ఆటతీరుకు మరింత మెరుగులు అద్దుకున్నాడు. క్రికెట్‌లో ఓనమాలు నేర్పించిన సలామ్ బాయిష్ శిక్షణలో మరింత రాటుదేలాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు ముందు హైదరాబాద్‌లో తన కొత్త షాట్లకు మరింత పదునుపెట్టుకున్నాడు. సిమెంట్ పిచ్‌పై బుల్లెట్‌లా దూసుకొచ్చే బంతులను అంతే వేగంతో కొడుతూ ప్రాక్టీస్ చేయడం కలిసొచ్చింది. దీనికి తోడు ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ సహచరుడు సూర్యకుమార్ ఆటతీరును దగ్గరుండి పరిశీలించిన తిలక్ అదే శైలిలో నెట్స్‌లో ప్రాక్టీస్ చేసి ఫలితం రాబట్టాడు. ఇదంతా ఎందుకు చెప్పుకోవాల్సి వస్తుందంటే నాలుగో టీ20లో అభిషేక్ ఔట్ కాగానే క్రీజులోకి వచ్చిన తిలక్‌ను కట్టడి చేసేందుకు లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను కెప్టెన్ మార్క్‌రమ్ దింపాడు. ఐపీఎల్ తరహాలో ఇబ్బంది పడుతాడనుకున్న తిలక్..మార్క్‌రమ్ ఎత్తులను చిత్తుచేస్తూ మహరాజ్‌ను గట్టిగా అరుసుకున్నాడు. మరోవైపు పేసర్లను అదే స్థాయిలో దంచికొట్టడం తిలక్ ఆటశైలిలో మార్పును తెలుపుతున్నది. ఔట్ సైడ్ ఆఫ్‌స్టంప్ బంతులు వేసిన సింపాలకు తిలక్ అదే శిక్ష వేశాడు. బంతి ఎక్కడ పడ్డా తన పుట్‌వర్క్‌ను అంతే వేగంగా మార్చుకుంటూ బంతులను స్టాండ్స్‌లోకి మార్చిన తీరు నభూతో నభవిష్యత్ అనిపించింది.

మూడుకు 'న్యాయం'

కీలకమైన మూడో స్థానానికి తిలక్ సరైన న్యాయం చేశాడు. తొలి రెండు టీ20 ల్లో నాలుగు, ఐదు స్థానాల్లో బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్.. మూడు, నాలుగు మ్యాచ్‌ల్లో ప్రమోషన్ దక్కించుకున్నాడు. ఇన్ని రోజులు కోహ్లీ లాంటి దిగ్గజం ఆడిన స్థానం లో వచ్చిన తిలక్ ఆశాకిరణంలా కనిపించాడని మ్యాచ్ ముగిసిన తర్వాత సూర్యకుమార్ ప్రశంసలతో ముంచెత్తాడు.

టీ20ల్లో తిలక్ మ్యా: 20 ప: 616 అ.స్కో: 120* స: 51.33 సె: 2, అ.సె: 2
నోట్: మ్యా: మ్యాచ్‌లు, ప: పరుగులు, స: సగటు, సె: సెంచరీలు, అ.సె: అర్ధసెంచరీలు

బ్లాక్‌బర్డ్స్ డబుల్ ధమాకా

కోయంబత్తూరు: ఇండియన్ రేసింగ్ లీగ్ ఫెస్టివెల్(ఐఆర్ఎఫ్) ఫైనల్ రౌండ్ తొలి రోజు హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీమ్ డబుల్ పోడియం ఫినిష్ చేసింది. ఫార్ములా-4 ఇండియన్ ఓపెన్, ఇండియన్ రేసింగ్ లీగ్(ఐఆర్ఎల్)లో భాగంగా శనివారం జరిగిన ఓపెన్ రేసులో దక్షిణాఫ్రికాకు చెందిన అకిల్ అలీభాయ్ 26:14:47సెకన్ల టైమింగ్‌తో అందరికంటే ముందు రేసును పూర్తి చేశాడు.

జాన్సన్ పాంచ్ పటాకా

సిడ్నీ: పాకిస్థాన్‌తో శనివారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఆసీస్ 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. కంగారూలు నిర్దేశించిన 148 పరుగుల లక్ష్యఛేదనలో యువ పేసర్ స్పెన్సర్ జాన్సన్ (5/26) ధాటికి పాక్..19.4 ఓవర్లలో 134 పరుగులకు పరిమితమైంది. ఉస్మాన్ ఖాన్(57), ఇర్ఫాన్‌ఖాన్(37 నాటౌట్) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. జంపా (2/19)కు రెండు వికెట్లు దక్కాయి. తొలుత షార్ట్(32), హార్డీ(28) రాణించడంతో ఆసీస్ 20 ఓవరల్లో 147/9 స్కోరు చేసింది. హారిస్ రవూఫ్(4/22), అఫ్రీది(3/17) ఆకట్టుకున్నారు.

గిల్‌కు గాయం

పెర్త్: ఆస్ట్రేలియాతో ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి ముందు భారత్‌కు ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఇప్పటికే స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్ ఎదుర్కొన్న టీమ్‌ఇండియా ప్లేయర్ల గాయాలు కలవరపెడుతున్నాయి. ఇప్పటికే కేఎల్ రాహుల్ గాయపడగా, తాజాగా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ ఎడమచేతి వేలుకు గాయమైంది. ఇంట్రా మ్యాచ్‌లో భాగంగా శనివారం ఫీల్డింగ్ చేస్తుండగా గిల్ గాయపడ్డాడు. ఈనెల 22 నుంచి మొదలయ్యే తొలి టెస్టుకు గిల్ అందుబాటులో ఉండే అవకాశం లేదని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

నిష్కకు కాంస్యం | జిమ్నోవ కప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బెల్జియం వేదికగా జరిగిన జింపియాస్ జిమ్నోవకప్ అర్టిస్టిక్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ జిమ్నాస్ట్ నిష్క అగర్వాల్ కాంస్య పతకంతో మెరిసింది. శనివారం జరిగిన బాలికల సీనియర్ టేబుల్ వాల్ట్ ఈవెంట్ ఫైనల్లో నిష్క 12.81 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో మార్యమ్ సాబెర్(కెనడా, 12.93), సమీరా రఫీన్(స్విట్జర్లాండ్, 12.91) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. మొత్తం 14 దేశాలకు చెందిన జిమ్నాస్ట్‌లు పాల్గొన్న టోర్నీలో పతకం సాధించిన తొలి భారత జిమ్నాస్ట్‌గా నిష్క నిలిచింది. ప్రస్తుతం నగరంలోని గాడియం స్పోర్ట్టోపియాలో శిక్షణ తీసుకుంటున్న నిష్క జిమ్నాస్టిక్స్‌లో నిలకడగా రాణిస్తున్నది.

హైదరాబాద్, ఆంధ్ర పోరు డ్రా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్, ఆంధ్ర జట్ల మధ్య స్థానిక ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా జరిగిన రంజీ గ్రూపు-బీ పోరు డ్రా గా ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన హైదరాబాద్ 51 ఓవర్లలో వికెట్ నష్టానికి 193 పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్(95) మరోమారు తనదైన శైలిలో ఆకట్టుకున్నాడు. అభిరాత్ రెడ్డి(70 నాటౌట్) అర్ధసెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. రఫీ(1/35)కి ఏకైక వికెట్ దక్కింది. అంతకముందు ఓవర్‌నైట్ స్కోరు 448/9తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్ర ఒక్క పరుగు జతచేయకుండానే ఆలౌటైంది. అనికేత్‌రెడ్డి(4/137), రక్షణ్‌రెడ్డి(3/75) ఆకట్టుకున్నారు. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్లు డ్రాకు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఆంధ్రకు 3 పాయింట్లు దక్కగా, హైదరాబాద్ ఒక పాయింట్‌కు పరిమితమైంది. హైదరాబాద్ 9పాయింట్లతో 6వ స్థానంలో ఉన్నది.

జూనియర్ రోహిత్ వచ్చేశాడు..

ముంబై: భారత కెప్టెన్ రోహిత్‌శర్మకు పుత్రోత్సాహం కల్గింది. శుక్రవారం రాత్రి రోహిత్ భార్య రితికా సజ్దే పండంటి మగబాబుకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని తన అధికారిక సోషల్‌మీడియా ద్వారా వెల్లడించాడు. రోహిత్, రితికాకు 2018లో సమైరా జన్మించింది. ఇదిలా ఉంటే రెండో సంతానం కోసం స్వదేశంలో ఉండిపోయిన హిట్‌మ్యాన్..పెర్త్ టెస్టుకు అందుబాటులో ఉంటాడా లేదా అన్నది సందిగ్ధంగా మారింది. ఈనెల 22 నుంచి తొలి టెస్టు నాటికి రోహిత్ జట్టుతో చేరేది లేనిది త్వరలో తేలనుంది.

సెమీస్‌కు భారత్ | ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీ

రాజ్‌గిర్(బీహార్): మహిళల ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో భారత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన క్వార్టర్స్‌లో భారత్ 3-0 తేడాతో చైనాపై అద్భుత విజయం సాధించింది. టీమ్‌ఇండియా తరపున సంగితా కుమారి(32ని), కెప్టెన్ సలీమా టెటె(37ని), దీపిక(60ని) గోల్స్ చేశారు. తమ(9) కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న చైనా(6)పై భారత్ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. వరుసగా నాలుగో విజయంతో భారత్ ప్రస్తుతం 8 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, చైనా(6) రెండో స్థానంలో ఉంది. ఆదివారం జరిగే సెమీస్‌లో భారత్..జపాన్‌తో తలపడుతుంది. మ్యాచ్ విషయానికొస్తే..సొంత గడ్డపై అభిమానుల మద్దతు మధ్య టీమ్‌ఇండియా ఆది నుంచే మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. మ్యాచ్ 32వ నిమిషంలో సంగీత ఫీల్డ్ గోల్‌తో ఖాతా తెరువగా, ఐదు నిమిషాల తేడాతో సలీమ మరో గోల్ చేసింది. దీంతో టీమ్‌ఇండియాకు 2-0 ఆధిక్యం దక్కింది. మ్యాచ్ మరో నిమిషంలో ముగుస్తుందనగా దీపిక చేసిన పెనాల్టీ కార్నర్ గోల్‌తో భారత్ భారీ విజయం ఖరారైంది.

టైసన్‌కు పాల్ పంచ్

అర్లింగ్టన్(అమెరికా): బాక్సింగ్ ఆల్‌టైమ్ గ్రేట్ మైఖ్ టైసన్‌కు చుక్కెదురైంది. తన పవర్‌ఫుల్ పంచ్‌లతో ప్రపంచ బాక్సింగ్‌ను ఏకచత్రాధిపత్యంతో ఏలిన టైసన్..అనామక జేక్ పాల్ ముందు తలొంచాడు. అభిమానుల్లో బాగా హైప్ క్రియేట్ చేసిన ఫైట్‌లో టైసన్‌పై జేక్ పాల్ విజయం సాధించాడు. శనివారం ఆసక్తికరంగా సాగిన బాక్సింగ్ బౌట్‌లో 27ఏండ్ల పాల్ పంచ్‌లకు 58 ఏండ్ల టైసన్ దీటైన సమాధానం ఇవ్వలేదు. బౌట్‌కు ముందే ఉత్కంఠ రేపినా..అసలు పోరు మాత్రం అభిమానులను అలరించలేకపోయింది. దాదాపు 20 ఏండ్ల తర్వాత తిరిగి బాక్సింగ్ రింగ్‌లోకి ప్రవేశించిన టైసన్..తన ట్రేడ్‌మార్క్ పంచ్‌లు విసరడంలో విఫలమయ్యాడు. యూట్యూబర్ నుంచి బాక్సర్‌గా మారిన పాల్ తనదైన రీతిలో రింగ్‌లో చురుకుగా కదులుతూ రిఫరీలను ఆకట్టుకున్నాడు.

బ్యాడ్మింటన్ చాంప్ శ్రావ్య

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మేడ్చల్-మల్కాజిగిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నీలో శ్రావ్య విజేతగా నిలిచింది. శనివారం జరిగిన బాలికల అండర్-11 ఫైనల్లో శ్రావ్య టైటిల్ సొంతం చేసుకోగా, అండర్-13లో ఆరాధ్య, మనస్వీ చాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. బాలుర అండర్-13 డబుల్స్‌లో విదిత్‌రెడ్డి, రవికిషోర్ జోడీ 21-14, 21-15తో కార్తీకేయ, శివాంశు ద్వయంపై గెలిచారు. బహుమతి ప్రదాన కార్యక్రమానికి జాతీయ మాజీ చీఫ్ కోచ్ భాస్కర్ బాబు అతిథిగా హాజరయ్యారు.

సినీనటి కస్తూరి అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): తమిళనాడులోని తెలుగువారిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో సినీనటి కస్తూరి హైదరాబాద్‌లో అరెస్టయ్యారు. ముందస్తు బెయిల్ కోసం కస్తూరి దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేయడంతో ఆమెను అరెస్టు చేసేందుకు తమిళనాడు పోలీసులు రంగంలోకి దిగారు. చెన్నైలోని ఆమె ఇంటికి తాళం వేసి ఉండటం, ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో తమిళనాడు పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. కస్తూరి ఆచూకీ కోసం విస్తృతంగా గాలించి, శనివారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి చెన్నై తరలించారు.

ఏమిటీ కేసు?

ఇటీవల తమిళనాడులోని రాజకీయ పార్టీ 'హిందూ మక్కల్ కచ్చి' ఏర్పాటు చేసిన ఆందోళనలో పాల్గొన్న కస్తూరి ద్రవిడ పార్టీలను ఉద్దేశించి ఆగ్రహంగా మాట్లాడారు. ద్రవిడ పార్టీలు బ్రాహ్మణులను పరాయివాళ్లుగా చూడటం సరికాదని మండిపడ్డారు. ఈ క్రమంలో ఆమె తెలుగువారి పట్ల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. తమిళనాడులోని రాజుల అంతఃపురంలో పని చేసేందుకు వచ్చిన తెలుగువాళ్లను తమిళనాడు స్థానికులుగా భావిస్తూ, బ్రాహ్మణులను మాత్రం పరాయి వాళ్లుగా చూడటం ఏంటని ఆమె ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలే ఆమెను వివాదంలోకి నెట్టాయి. కస్తూరి వ్యాఖ్యలు తెలుగువారిని అవమానించడమేనని చెన్నైలోని పలు తెలుగు సంఘాలు వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశాయి. దీంతో నాలుగు సెక్షన్ల కింద ఎగ్మోర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కస్తూరి ఏమన్నారు?

తెలుగువారి పట్ల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయిన సమయంలో కస్తూరి వివరణ ఇచ్చారు. ద్రవిడ పార్టీలు తన వ్యాఖ్యలను వక్రీకరించాయని అన్నారు. తెలుగు ప్రజలను అవమానించడం తన ఉద్దేశం కాదని తెలిపారు. కేవలం బ్రాహ్మణులను పరాయివాళ్లుగా చూడటం ఏంటని ప్రశ్నించానని, అంతే తప్ప తెలుగువారిని కించపర్చలేదని వివరణ ఇచ్చారు.

ఠాణాలోనే వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చొప్పదండి ఎస్సై వేధింపులు భరించలేక..

పోలీస్ స్టేషన్‌లో పురుగుల మందు తాగుతున్న కల్లెపల్లి ఆనంద్

చొప్పదండి, నవంబర్ 16 : ఎస్సై వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఠాణాలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో శనివారం చోటుచేసుకున్నది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. చొప్పదండికి చెందిన కల్లెపల్లి ఆనంద్, శారద దంపతులు. వారి ఇంటి పక్కనే వడ్లూరి లింగయ్య కుటుంబం నివాసం ఉంటుంది. లింగయ్యతోపాటు ఆయన కుటుంబసభ్యులు రామలక్ష్మి, గజ్జెల విమల, అంజయ్య, సీపెల్లి నిర్మల, గజ్జెల సబ్సీనా, గజ్జెల ఇంద్ర హర్షిత్ కలిసి రెండేండ్ల మధ్యలో హద్దురాళ్లు తీసేసి ఆనంద్ భూమిలోకి చొరబడ్డారు. హద్దురాళ్లను పాతేందుకు ప్రయత్నించగా ఆనంద్ అడ్డుకున్నాడు. ఈ ఏడుగురు ఆనంద్ కుటుంబ సభ్యులతో గొడవకు దిగి చంపుతామని బెదిరించారు. దీంతో ఆనంద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై అనూషకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసును ఎస్సై అనూష, కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తప్పుదోవ పట్టించారని ఆనంద్ భార్య శారద తెలిపింది. తమపై తప్పుడు కేసులు పెట్టారని వాపోయింది. ఈ విషయమై సీపీ అభిషేక్ మొహంతికి కూడా ఫిర్యాదు చేసినట్టు పేర్కొంది. తమకు న్యాయం జరగడం లేదని శనివారం ఆనంద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఆనంద్ ఫిర్యాదు మేరకు లింగయ్య కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశానని, ఆనంద్‌ను ఇబ్బందులకు గురిచేయలేదని ఎస్సై అనూష తెలిపారు.

నాలుగో రోజూ ఆటో డ్రైవర్ల భిక్షాటన

21న మహా ధర్నాకు సిద్ధమవుతున్న తెలంగాణ ఆటో జేఏసీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ చాలా రోజులుగా ఆందోళన చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఆ పార్టీ తీరు దున్నపోతు మీద వానపడ్డటే ఉన్నదని ఆటో జేఏసీ నాయకులు విమర్శించారు. జేఏసీ ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమం నాలుగో రోజూ కొనసాగింది. శనివారం తార్నాక, నాచారం, బంజారా హిల్స్ తదితర ప్రాంతాల్లో డ్రైవర్లు భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో నాయకులు మాట్లాడుతూ తమ ఉపాధిని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బకొట్టిందని తెలిపారు. ఉపాధిలేక డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 21న జరుగనున్న మహాధర్నాకు ఆటో డ్రైవర్లు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హబీబ్, శ్రీనివాస్, అస్లాం, రవి, కొమరయ్య, సాయిలు, చందు తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో చదువుకోండి

ఆస్ట్రేలియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ విక్‌సింగ్ పిలుపు

హైదరాబాద్, నవంబర్ 16(నమస్తే తెలంగాణ): ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీల్లో విద్యావకాశాలను భారతీయ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆస్ట్రేలియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ విక్‌సింగ్ పిలుపునిచ్చారు. ఆస్ట్రేలియాలో విద్యావకాశాలపై కమిషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో 'ఫెస్టివల్ ఆఫ్ ఆస్ట్రేలియా' పేరుతో సదస్సు నిర్వహించారు. ఆస్ట్రేలియాలోని విశ్వవిద్యాలయాలు, రిటైల్, ఇతర వాణిజ్య భాగస్వాముల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆ దేశంలో అందుబాటులో ఉన్న ఉత్తమ కోర్సులు, కల్పించే వసతులు, వాటివల్ల కలిగే ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై విశ్వవిద్యాలయాల ప్రతినిధులు వివరించారు. ఆస్ట్రేలియాలో ప్రఖ్యాతి గాంచిన ఆహార పదార్థాలు, ఆహార ఉత్పత్తులను సదస్సులో ప్రదర్శించారు.

ఆరు గ్యారెంటీలకు కాంగ్రెస్ మంగళం

- తెలంగాణలో ఒక్క హామీ నెరవేర్చలే
- పరిపాలనలో రేవంత్‌రెడ్డి ఫెయిల్
- మహారాష్ట్ర ఎన్నికల సభలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కుభీర్, నవంబర్ 16 : తెలంగాణలో ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను మభ్యపెట్టి ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి చేతులెత్తేశారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్‌రావు చౌహాన్ విమర్శించారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలానికి ఆనుకుని ఉన్న మహారాష్ట్రలోని బోఖర్ తాలూకా పాలజ్‌లో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో వారు పాల్గొన్నారు. భోఖర్ మహాయుతి అభ్యర్థి జయాచౌహాన్, నాందేడ్ ఎంపీ అభ్యర్థి సంతుక్‌రావు అంబర్టే తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సభలో మాట్లాడుతూ.. మహారాష్ట్రలో రిజర్వేషన్ల కోసం కులాలను రెచ్చగొట్టి కుల రాజకీయాలకు తెరలేపారని ఆరోపించారు. హామీల అమలుతోపాటు పరిపాలనలో ఫెయిల్ అయిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టి మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తున్నదని ధ్వజమెత్తారు. 'మీ ఆశీర్వాదంతో మహారాష్ట్రలో మళ్లీ అధికారంలోకి వచ్చేది మహాయుతి కూటమే'నని జోస్యం చెప్పారు.

పాలజ్ ఎన్నికల ప్రచారసభలో అభివాదం చేస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

20లోగా పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- లేకపోతే వేములవాడలో సీఎం పర్యటనను అడ్డుకుంటాం
- మాజీ సర్పంచుల హెచ్చరిక

తెలంగాణచౌక్, నవంబర్ 16: గ్రామ పంచాయతీల్లో 2019 నుంచి 2024 వరకు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తాజా మాజీ సర్పంచులు కరుణాకర్, జగన్‌మోహన్‌గౌడ్, అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. ఐదేండ్ల క్రితం గ్రామాల్లో నిర్మించిన రోడ్లు, వైకుంఠధామాలు, క్రీడా మైదానాలు, ట్యాంకులకు సంబంధించి ఎంబీ రికార్డులను అధికారులకు అందించినా ఇప్పటివరకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా బిల్లులు ఇవ్వకుండా వేధిస్తున్నదని మండిపడ్డారు. 20లోగా పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటనను 1200 మంది మాజీ సర్పంచులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు.

హౌసింగ్ భూములపై సర్కారు కన్ను

- విక్రయానికి సిద్ధమవుతున్న విధివిధానాలు
- 'విభజన' చిక్కుముడి వీడిన వెంటనే అమ్మకం

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌తోపాటు దాని పరిసర ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డుకు ఉన్న అత్యంత విలువైన భూములపై ప్రభుత్వం కన్నేసింది. వీటి విక్రయానికి విధివిధానాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఆ భూముల వివరాలను ప్రభుత్వానికి సమర్పించిన అధికారులు.. ప్రస్తుతం వాటి చుట్టూ ప్రహరీల నిర్మాణం చేపట్టారు. ఏపీ, తెలంగాణల మధ్య ఆస్తుల పంపకం పూర్తయిన వెంటనే ఆ భూములను విక్రయించనున్నట్టు తెలుస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు ఇండ్లు నిర్మించాలనే ఉద్దేశంతో దశాబ్దాల క్రితం ఏర్పాటైన హౌసింగ్ బోర్డు కాలక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్, గృహకల్ప లాంటి సంస్థల ఏర్పాటుతో ప్రాభవాన్ని కోల్పోయింది. అయినప్పటికీ ఇంకా హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డుకు విలువైన భూములు ఉన్నాయి. గతంలో ఈ బోర్డు పరిధిలో 4,759 ఎకరాల భూములుండగా.. వాటిలో 3,820 ఎకరాల్లో కాలనీలు నిర్మించి విక్రయించారు. మిగిలిన 939 ఎకరాల్లో లీజులు, కోర్టు కేసుల భూములు పోగా ప్రస్తుతం 703 ఎకరాల భూములు వివాదాల్లేకుండా క్లియర్‌గా ఉన్నాయి. వీటిలో సింహభాగం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోనే ఉండడంతో విలువ భారీగా పెరిగింది. ప్రస్తుతం ఆదాయ వనరుల కోసం అన్వేషిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ భూములపై దృష్టి సారించింది. టీజీఐఐసీ, హెచ్ఎండీఏ భూముల తరహాలో హౌసింగ్ బోర్డు భూములను కూడా విక్రయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది.

ప్రభుత్వానికి చేరిన భూముల నివేదిక

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ అందుకు సరిపడా బడ్జెట్‌లో నిధులను కేటాయించలేదు. హౌసింగ్ బోర్